వ్యాపార కేంద్రంగా కందనవోలు

- కార్పొరేట్ సంస్థలకు దీటుగా స్థానిక వ్యాపారాలు
- రియల్ ఎస్టేట్, జ్యువెలరీ, ఫర్నీచర్ షోరూమ్స్, టెక్స్‌టైల్స్‌కు పెట్టింది పేరు
- హాస్పిటల్స్, స్కూల్స్ అండ్ కాలేజీలకు నెలవు
- ఆటోమొబైల్స్, హోటల్స్, స్వీట్స్ అండ్ బేకరీ వ్యాపారాల్లో ముందడుగు



అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో నగల షోరూం



బాబా బృందావనం కాలనీలో కార్ డెకార్స్ షాప్

కర్నూలు కల్చరల్: ఆంధ్ర రాష్ట్ర మొదటి రాజధాని.. రాయలసీమ ముఖ ద్వారం.. కందనవోలు (కర్నూలు) అన్ని రకాల వ్యాపారాలకు కేంద్రంగా నిలుస్తోంది. ప్రస్తుతం 6 లక్షల జనాభా ఉన్న కర్నూలు నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. ఒకప్పుడు చిరు వ్యాపారాలకే పరిమితమైన కర్నూలు నేడు కార్పొరేట్ సంస్థలకు దీటుగా వ్యాపార రంగంలో కొత్త పుంతలు తొక్కుతూ నవ్యతను సంతరించుకుంటోంది. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలు వస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, జ్యువెలరీ, ఫర్నీచర్, వైద్యం, లగ్జరీ హోటల్స్, ఫుడ్ కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి మహా నగరాలకు వెళ్లేవారు. అయితే కొంతకాలంగా కర్నూలు వ్యాపార రంగం విస్తరించడం ప్రారంభించింది. దీంతో పలు కార్పొరేట్ సంస్థలు కర్నూలుకు క్యూకట్టాయి. వస్త్ర దుకాణాలు, మాల్స్, ఆస్పత్రులు, సర్జికల్స్, ఆటోమొబైల్స్ వంటి దుకాణాలు మార్కెట్‌లోకి తరలివచ్చాయి. కార్పొరేట్ సంస్థలకు దీటుగా స్థానిక వ్యాపార సంస్థలు కూడా తమ వ్యాపారాలను విస్తరించాయి. దీంతో ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కర్నూలు నగర శివారులో బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా పేరెన్నిక గన్న రెస్టారెంట్లు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఇవి ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు నగర చుట్టుపక్కల డూప్లెక్స్, విల్లాస్ నిర్మాణం శరవేగంగా సాగిస్తున్నాయి. ప్రముఖ విద్యాసంస్థల ఏర్పాటుతో జిల్లా వాసులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చింది. పేరెన్నికగన్న కార్పొరేట్ హాస్పిటల్స్ రావడంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందుతోంది. గత పది సంవత్సరాలకు ఇప్పటికి వ్యాపార పరంగా కర్నూలు ఊహించనంత మెరుగైందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రియల్ ఎస్టేట్ రంగం

కర్నూలు నగరంలో రియల్‌ఎస్టేట్ రంగం ఆశాజనకంగా ఉంది. 6 లక్షల జనాభాకు విస్తరించిన కర్నూలు సిటీతో పాటు శివారు కాలనీలు, నగరానికి 10 కిలోమీటర్ల చుట్టూ వెంచర్లు వెలిశాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల వ్యాపారం పుంజుకుంది. పట్టణానికి నలువైపులా జాతీయ రహదారులు ఉండటం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కలిసి వస్తోంది. నూతన వెంచర్లతో వ్యాపారం కళకళలాడుతోంది.



నగరంలో బేకరి

విద్యా రంగం

విద్యా రంగంలోనూ కర్నూలు పట్టణం ముందంజలో ఉంది. ఇక్కడ కార్పొరేట్ విద్యా సంస్థలు గాకుండా 160కి పైగా ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. నగరంలోని విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో ఇతర జిల్లాలు, ఇతర ప్రాంతలవారు సైతం ఇక్కడి విద్యా సంస్థలను ఆశ్రయిస్తున్నారు. కొని విద్యాసంస్థలు సెంట్రల్ సిలబస్‌కు నిలయాలుగా మారాయి.



ఆటో మొబైల్ దుకాణం

ఆటోమొబైల్స్ రంగం

నగరంలో హీరో, హీరో హోండా, టీవీఎస్, రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలకు చెందిన షోరూంలతో పాటు కార్లకు సంబంధించి మారుతి సుజికి, మహీంద్ర, హ్యూండాయ్, టాటా నిక్సాన్, కియా షోరూంలు ఉన్నాయి. వ్యాపార కార్యకలాపాలు ఆశాజనకంగా జరుగుతున్నాయి.

వైద్య రంగం

కర్నూలు నగరం వైద్యానికి పెట్టింది పేరు. మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌తో పాటు, 80కి పైగా ప్రైవేట్ ఆస్పత్రులు ఇక్కడ వైద్యం అందిస్తున్నాయి. అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉంటూ వారంలో అన్ని రోజులు వైద్యం అందిస్తుంటారు.

వస్త్ర దుకాణాలు

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ లాంటి మహా నగరాల్లోన్న ఉన్న పెద్ద పెద్ద వస్త్ర దుకాణాలు వాటి షోరూలను కర్నూలు నగరంలో ఏర్పాటు చేశాయి. వాటితో పాటు స్థానిక వస్త్ర దుకాణాల్లో సైతం జోరుగా వ్యాపారం సాగుతోంది.

పెరిగిన సోలార్ వినియోగం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా పట్టణంలో సోలార్ వినియోగం పెరిగింది. ప్రజలు సోలార్ సిస్టమ్ ద్వారా గృహ అవసరాలకు విద్యుత్‌ను సమకూర్చుకుంటున్నారు. సోలార్ సిస్టమ్, ప్యానల్స్‌కు కేంద్రం సబ్సిడీ ఇస్తుండటంతో ఎక్కువ మంది ఆ దిశగా మొగ్గు చూపుతున్నారు. ఒక కేవీ సోలార్ ప్యానల్ ద్వారా ఒక రోజుకు 4 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. సోలార్ యూనిట్ ఏర్పాటుకు బ్యాంకు ద్వారా 7 శాతం వడ్డీతో రుణ సదుపాయం కల్పిస్తున్నారు.